# ఆల్బర్ట్ ష్వెయిట్జర్

"ఉడుముండదె నూరేండ్లును ?-"

అన్నాడు కవి. ఉండడం, పడి వుండడం, ఎలాగో ఒకలాగున వుండడం అన్నది జీవచ్ఛవాల లక్షణం. అనుక్షణమూ స్పందిస్తూ, వెతుకుతూ, ఎదుగుతూ, విస్తరిస్తూ, చీకట్ల నెదిరిస్తూ, వెలుగులు వెదజల్లుతూ, "మానవ జన్మ అన్నది. ఇదుగో ఇందుకు!" అని నిర్వచిస్తున్నట్లుగా బ్రతకడం మనిషి లక్షణం.

అలాంటి మనిషి చేతులే అవి. అవి అక్కడ కీకారణ్యంలో గొడ్డలిని చేత పట్టి వృక్షాలను నేల కూల్చి, ఆ చోటునంతా చదునుగా చేసి, ఆ వృక్షాలను కోసి పలకలుగా చెక్కి వాటితో చక్కటి ఇళ్ళను, వైద్యశాలలను నిర్మించాయి.

ఆ చేతులే శస్త్రచికిత్స పనిముట్లను సుతారంగా వాడి వందలాది జనుల బాధను తగ్గించాయి, మందుల నందించి వారినారోగ్యవంతులను చేశాయి.

ఆ చేతులే ఆర్గాన్ వాయిద్యపు మెట్లమీద అలవోకగా నాట్యంచేసి పాశ్చాత్య శాస్త్రీయ సంగీత సుధలను వర్షించాయి.

ఆ చేతులే కలాన్ని పూని- "చారిత్రక దృష్ట్యా జీసస్'', "జీసస్ మానసిక పరిశోధన'', "ఒక పురాతన అరణ్యపుటంచున'', "భారతీయ

ఆలోచనా ధార-దాని ఎదుగుదల-" వంటి విషయాలమీద 1600 పుటల ఉద్గ్రంధాలను రచించాయి.

నిజంగా, అవి ఎంతటి మహత్తర హస్తాలు !

♦ ♦ ♦

అలా చేతులతో, శరీరంతో, మేధతో, హృదయంతో, ఆత్మతో అనుక్షణమూ, చైతన్యవంతంగా మూర్తిమంతంగా జీవించిన ఆ మహాను భావుడి పేరు ఆల్బర్ట్ ష్వైట్జర్ !

ష్వైట్జర్‌ని, ఆఫ్రికాలో మారుమూల కీకారణ్యం మధ్య ఆస్పత్రి నిర్మించి అనేక వేలమందికి ఆరోగ్యం ప్రసాదించిన ఆధునిక అశ్వనీ దేవత గానే చాలమంది ఎరుగుదురు....కాని ఆయన బహుముఖ వ్యక్తిత్వంలోని ఇతర అంశాలను ఎరుగరు.

1875 లో జర్మనీలోని కెయ్‌సర్ బర్గ్‌లో జన్మించిన ష్వైట్జర్-తనకు అలౌకిక ఆనందం యొక్క అనుభూతి సంగీతం ద్వారా లభించిం దని పేర్కొన్నాడు. మొదట తన తండ్రియొక్క పాత పియానోమీద, తర్వాత హార్మోనియం మీద పాటలు వాయించడానికి తంటాలుపడ్డ ష్వైట్జర్‌కు బాల్యం నుంచే జానపద గీతాలంటే ఇష్టంగా వుండేది. సంగీతం ఆ బాలుడిని 'అక్షరాలా' కదిలించివేసేది. కొన్నిపాటలు వింటు న్నప్పుడు-అతడు నఖశిఖపర్యంతం ఎంతగా వణికిపోయేవాడంటే-క్రింద పడిపోకుండా వుండడానికి గోడను ఆనుకోవలసి వచ్చేదట ! చలదళం (రావియాకు) వంటిది గనుకనే ఆయన ఎద, సంగీతమన్నా, సర్వసృష్టిలోని జీవరాశి యన్నా, సాటి మానవుడి బాధ అన్నా అంతగా స్పందించింది. ఆ స్పందన లేని గుండె కప్పనోటివలె లబ్‌డబ్ మని ఎన్ని కోట్లసారులు కొట్టుకుంటేనేమి, అది ఒక మర మాత్రమే కదా...

ఆర్గానో, పియానో వాయిద్యాలను పేరొందిన గురువులవద్ద అభ్యసించాడు యువకుడు ష్వెయిట్జర్. తత్వశాస్త్రాన్ని, విజ్ఞానశాస్త్రాన్నీ మతాన్ని అధ్యయనం చేశాడు. ప్రేమించే తల్లిదండ్రులు, తగుపాటి సుఖసంపదలు, ఆదరణ, తనకు నచ్చినవాటిని చేయగల స్తోమత-వీటన్నిటివలన కలిగే ఆనందంతో బాటే అతగాడికి-గౌతముడికి వలెనే ప్రపంచంలోని ఆర్తి, బాధ, ఇవి అమితమైన ఆవేదనను కల్గించాయి. లోకంలో ఇంతటి బాధ వుండగా తాను జీవితంలో ఎదురయిన సుఖసంతోషాల నిలాహాయిగా స్వీకరించి తృప్తిగా వుండడం తగునా-అని అతడు మథన పడసాగాడు.

1905 పాటికి ఒకపక్క విద్యాభ్యాసం కావిస్తూనే, ఇంకొకప్రక్క-సుప్రసిద్ధ కవి అయిన "బాక్" మీద అపూర్వమైన గ్రంథాన్ని ఫ్రెంచ్‌లో రచించాడు. (తర్వాత 1908 లో ఇదే గ్రంథాన్ని జర్మన్‌లో రాశాడు.) 1904 లో ఒక పారిస్ పత్రికలో ఆఫ్రికన్ నీగ్రోల గురించి చూడగానే, వారి వ్యాధిగురించి చదవగానే ష్వెయిట్జర్‌కు తా నిన్నాళ్ళు పడుతున్న బాధకు అర్థం తెలిసింది. తన దారి ఏదో ఎవరో వేలెత్తి చూపినట్లయింది. వెంటనే అతడు వైద్య విద్య నభ్యసించడానికి, అది ముగియగానే ఆఫ్రికా వెళ్ళడానికీ నిశ్చయించాడు!

అతడి బంధు మిత్ర వర్గమంతా ఆశ్చర్యపోయింది. ముప్పైయేళ్ళకే తత్త్వశాస్త్రవేత్తగా, మత విషయాలలో అధికారిగా, సంగీతకారుడిగా, కీర్తి ప్రతిష్ఠలు సంపాదించినవాడు ఇవన్నీ వదులుకుని ఎక్కడో ఆఫ్రికాలో మారుమూల అడవుల్లోకి వెళ్ళిపోవడమా?-

"ఇన్నాళ్ళు మాటలు మాట్లాడాను, రాతలు రాశాను. ఇపుడింక కార్యరంగంలోకి దూకి పనిచేయవలసిన సమయం ఆసన్నమయింది!" వేదికలు పరీక్షా మందిరాలూ చాలునన్నాడు. జీవితరంగంలోకి దూకాలన్నాడు.

దూకాడు.

1913 లో భార్యతోపాటు ఓడమీద బయలుదేరి వెళ్ళి ఆఫ్రికాలోని లాంబరీన్ చేరాడు. కాకులు దూరని కారడవిలో, స్వయంగా చెట్లను నరికి తన చేతులతో ఆస్పత్రిని నిర్మించాడు. గ్రామాలు తిరిగాడు. తానంటే ఆ అనాగరికులకు నమ్మకం కలిగేలా చేశాడు. వారి జబ్బుల నధ్యయనం చేశాడు. మందులతో, శస్త్రచికిత్సతో వారి వ్యాధులను నయం చేశాడు. భార్య సహాయంతో ఆకాశం క్రింద ఆపరేషన్లు చేసేవాడట ఆయన! మొదటి తొమ్మిది నెలలలోనూ రెండువేలమందికి చికిత్స చేశాడు.

ఈ విధంగా 1917 దాక నాలుగేళ్ళు సేవచేసిన ఈ మహానుభావుడి జీవితంలోకి ప్రపంచయుద్ధపు విషాదచ్ఛాయలు తొంగిచూశాయి. వీరున్న ఆఫ్రికన్ భూభాగం ఫ్రెంచివారిదయినందున వీరు జర్మన్లయినందున, ఎక్కడో యుద్ధంలో ఈ రెండు దేశాలూ ప్రత్యర్థులు గనుక, ష్వెయిట్జర్ దంపతులను బందీలుగా చేసి ఫ్రాన్స్‌కు తీసుకువెళ్ళి వుంచారు!

కష్టాలన్నీ సజ్జనులకే కదా వస్తాయి. అలాగే ష్వెయిట్జర్ కూడా ఈ అవమానాలను భరించాడు. ఆ "ఖైదు" ముగిశాక జర్మనీ చేరాడు. యుద్ధం ముగిసింది. 1918-24 లో సంగీతం, గ్రంథరచన, తత్వశాస్త్ర పఠనాలతో గడిచిపోయాయి. 1918 లో ష్వెయిట్జర్ దంపతులకు కూతురు రీనా పుట్టింది. ఆయన యూరపు తనకిచ్చిన పదవిని, ఇస్తున్న గౌరవాలను, కీర్తి ప్రతిష్ఠలను- అన్నిటినీ త్యజించి 1924 లో మళ్లీ ఆఫ్రికా చేరాడు. మూడేళ్లు అక్కడి బాధాసర్పదష్టులకు అండగా నిలిచాడు.

1929 - 31, 33-34 '35 లలో ఆయన లాంబరీన్‌లో తన ఆస్పత్రి కార్యకలాపాలను పటిష్ఠం చేస్తూ ఆఫ్రికాలో వున్నాడు. మళ్లీ 1937-39 మధ్య, ఆ తర్వాత 39-48 మధ్య అక్కడే రోగుల సేవలో గడిపాడు. ఈనాడు మన దేశంలో పల్లె సీమలకు పొమ్మని ప్రాధేయ

పడితే వెళ్ళక పోవటానికి సాకులు వెతికే మన వైద్యులకు పనిగట్టుకొని ఖండాంతరం వెళ్ళి ఇంకొక జాతివారి బాధ నుపశమింప జేసిన ష్వైయిట్జర్ కూ ఎంత వ్యత్యాసం ;

పైకి, పై పైకి
నీ స్వప్నాలతో, నీ కోర్కెలతో
ఇంకా ఇంకా పైకి
నీ సేవాశయం వైపుగా .... పో ;
ఇంకా పై పైకి
మేఘాలు గుమికూడే చోటికి
ఆ ఎత్తు పైకి
నీ విశ్వాస నక్షత్రం వెలుగు సాయంతో
సాగిపో ;

అన్న కవితను విద్యార్థి దశలో పటం కట్టి తన మేజా పైగా వేలాడ దీసిన ష్వైయిట్జర్ తన జీవితాన్ని అలాగే నిండుగా జీవించాడు. సాఫల్యం, సార్థక్యం దండిగా చేకూరాయి ఆయన జీవితంలో ... అనేకానేక గౌరవాలు వచ్చి అయన పాదాలు దగ్గర వర్షించాయి. జూరిచ్ విశ్వ విద్యాలయంవారి గౌరవ డాక్టరేట్, ఫ్రాంక్ ఫర్ట్‌వారి 'గెతెపురస్కారం' ప్రాగ్ (జెకొస్లావేకియా) ఎడింబరో (స్కాట్లండ్) విశ్వవిద్యాలయాలవారి గౌరవ డాక్టరేట్‌లు, శాంతిబహుమతి, ఫ్రెంచ్ అకాడమీఅధ్యక్ష పదవి-ఇవన్నీ ఆయనను వరించిన గౌరవాలలో కొన్ని మాత్రమే. కష్టం వచ్చినపుడు కుంగ నట్లుగానే, అంతర్జాతీయంగా ఖ్యాతి, గౌరవం వచ్చినపుడు పొంగి పోని ష్వైయిట్జర్ భగవద్గీతలోని సూక్తిని గుర్తుకు తెస్తాడు. అంతేకాదు, భగవ

గీతలోని 'కర్మసన్యాసం' మీద ఆయన చక్కటి వ్యాఖ్య వ్రాసాడు. ఆ భావం జీర్ణించుకున్నవాడు గనుకనే గెఠె పురస్కారం అందుకున్నాక (1932) తన ప్రసంగంలో ఆయన "ప్రతివ్యక్తి ఆలోచనా పరుడవాలి. అంతేకాదు, కార్యశీలి కూడా కావాలి'' అని ఉద్బోధించాడు.

ఇంతటి ఎడతెరిపి లేని కార్యకలాపాల మధ్య ఆయన 1935 లో తన 60 వ పుట్టినరోజు సందర్భంగా, కొలంబియా కంపెనీ వారడిగగా "బాక్" సంగీతాన్ని ఆర్గాన్ మీద వాయించి అనేక రికార్డింగ్ చేశాడు!

తన రచనలలో అల్పశబ్దములనుండి అనల్ప అర్థములను సాధించి నట్లే చర్చి వేదికమీద నుండి తన ప్రసంగం చిన్నదిగా, అయినా భావ గర్భితంగా వుండడానికి యత్నించినట్లే - ష్వైయిట్జర్ తన ఆయుస్సులోని సంవత్సరాలనుండి ఎంతటి జీవితాన్ని పిండుకున్నాడో అనిపిస్తుంది. కీర్తి శిఖరాల నధిరోహించి, 1951 లో ఒకసారి ఫ్రాన్స్‌కు వస్తే, అక్కడ ప్రాతికేయుల గోష్ఠి, సన్మానాలు అయ్యాక ఆయన- "చకచక తన సూట్ కేసులను మోసుకుంటూ వెళ్ళి మూడవ తరగతి పెట్టెలోకి ఎక్కి కూచు న్నాడట"!! ఇంతటివాడూ వాళ్ళ వూళ్ళో ఎవరింట్లోనన్నా ఆరాన్ వాయిద్యం పాడయిందని తెలిస్తే నడుచుకుంటూ వెళ్లి మరమ్మత్తు చేసిపెట్టి వచ్చేవాడట! అంచేతే "తరువు లతిరసఫలభారగురుత గాంచు" నన్నాడు భర్తృహరి.

ఇంత నిండుగా పంటలు పండించిన ఈ ఆదర్శ జీవి చదివిన చదువు లలో కెల్ల మర్మం ఏమిటి అంటే "ప్రాణం పట్ల, తోటి ప్రాణిపట్ల గౌర వమే నీతి. పిపీలికంనుండి అనంత విశ్వందాక విస్తరించిన ప్రాణిపట్ల గౌరవం వుండాలి. ఇందులో దేనికయినా హాని కల్గించాల్సిన అవసరం వస్తే అది తప్పనిసరా అని ఆలోచించాకనే ఆ పని చేయాలి" అన్నాడు ష్వైయిట్జర్. "ప్రతి ప్రాణిపట్ల కారుణ్య భావం జాలువారనిదే ఏ నీతీ, ఏ ధర్మమూ కూడా పరిపూర్ణం కానేరదు" అని నిర్వచించాడాయన.

"మన ఆలోచనలంత ఎత్తుకు మన జీవితం ఎదగాలి. లేకపోతే మన జీవితాల స్థాయికి మన ఆలోచనలు దిగజారతాయి. హేతువాదం అన్నది చాల ఇరుకైన దారి. అది కొద్దిదూరం తరువాత అంతమవుతుంది. కాని విశ్వాసం అలాకాదు. హేతువును దాటి అనంత దూరాలకు తీసుకెళ్లే శక్తి దానికి వుంది... సర్వ ప్రాణికోటిపట్ల కారుణ్యభావం ద్వారా మనం నిజంగా వసుధైక కుటుంబం కాక విశ్వైక కుటుంబంలో సభ్యుల మవుతాము. ఆ విధంగా సర్వ విశ్వాన్ని ఆవరించేదే నిజమైన మతం, ధర్మమూను. ఈ ప్రపంచాన్ని అధిగమించడం మన ఆధ్యాత్మిక ఆశయం. సర్వప్రాణులపట్ల "కరుణ-గౌరవం" అనే ధర్మం ద్వారా ఈ ఆశయం సిద్ధించి మనలో మనకు శాంతి ఏర్పడడమేగాక- మనకు ఒకానొక గంభీరమైన, చైతన్య వంతమైన విధంగా భగవత్ సాక్షాత్కారం లభిస్తుంది" అన్నాడు జీవితపు పొలాన్ని అనేక హలాలతో దున్ని ఇబ్బడి ముబ్బడిగా పంటలు పండించి జగతికి పంచిపెట్టిన ఆ విశ్వహాలికుడు !

———